క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా డబుల్ రోడ్డులోని హియర్ వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో ఈ నెల 11 నుంచి 15 వరకు ఉచిత వినికిడి పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వినికిడి పరీక్షలు, హియరింగ్ ఎయిడ్ ట్రయల్, ప్రస్తుతం వాడుతున్న చెవి మిషన్ల చెకప్, పాత మిషన్లపై ఎక్స్ఛేంజీ ఆఫర్స్, అధునాతన మిషన్లపై ఈఎంఐ సదుపాయం ఉందని మరిన్ని వివరాలకు 9985631926, 9703235513 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్సీకి వినతి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని సిందూర్ ఎన్‌క్లేవ్‌కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదివారం ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఎమ్మెల్సీ నిధులతో వీలుపడకపోతే తన సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్లు అధ్యక్షుడు అనంతరాములు, కార్యదర్శి విజయసారథి పేర్కొన్నారు.

వరద నీరు నిల్వకుండా చర్యలు



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మహాలక్ష్మీ కాలనీలోని రోడ్లు, ఇళ్లలోకి నీరు చేరిందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా ఆదివారం ఆయన కార్పొరేటర్ హైడ్రా అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా సూపర్‌వైజర్ సతీష్, కాలనీ అధ్యక్షులు యాతయ్య, సభ్యులు రాజు. హరి, నాయకులు విష్ణు వర్ధన్‌రావు, శంకరయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు

టమాటా రూ.37, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.26, కాలిఫ్లవర్ రూ.21, క్యాబేజీ రూ.11, క్యారెట్ రూ.41, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.20, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.13, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.25, మునగ రూ.23, కందగడ్డ రూ.40, బీట్‌రూట్ రూ.28, కీర రూ.23, బీన్స్ రూ.60, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.


పుస్తె, మట్టెల అందజేత



యువతి వివాహానికి పుస్తే, మేట్టెలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త..

నాగోలు: పేదింటి ఆడపిల్లల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ అండగా ఉంటుందని చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన మధులత వివాహానికి ఆదివారం నాగోల్‌లోని ఆయన నివాసంలో పుస్తె, మట్టెలు చీర అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

దర్గా ఉర్సు ప్రారంభం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నిర్వాహకులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి చింతలకుంట సరస్వతినగర్‌కాలనీ కమాన్ వద్ద ఉన్న హజ్రత్ సయ్యద్ అబ్దుల్ షాహిద్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఉర్సు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దర్గా ముత్తవలి, సయ్యద్ పాష, సయ్యద్ అన్వర్‌పాష, సయ్యద్ హాజీ, సయ్యద్ జహంగీర్ పాల్గొన్నారు.

వీరభద్ర కాలనీలో మ్యాన్‌హోళ్లు పొంగి భారీగా రోడ్డుపైకి చేరిన మురుగు



కాలనీలు!

బస్తీ, కాలనీల్లో నిలుస్తున్న వరద • పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు

ఎల్‌బీనగర్: గత మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ఎల్‌బీనగరలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. నాలాలు, డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగి రోడ్లపై వరదతో పాటు మురుగు ఏరులై పారుతోంది. పలు కాలనీలలోని రోడ్లు కాలువలుగా, ఖాళీ ప్రదేశాలు చెరువులను తలపిస్తున్నాయి. చినుకులకే విజయవాడ జాతీయ రహదారి జలమయమవుతోంది. దిల్‌సుఖ్‌నగర్ నుంచి పెద్ద అంబర్‌పేట వరకు 16 నుంచి 18 కిలో మీటర్లు వెళ్లాలంటే రెండు గంటల పైనే పడుతుంది.

◆జాతీయ రహదారిపై దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, చింతలకుంట, ఆటోనగర్ భాగ్యలత, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షాలకు రోడ్లపైకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.ఇప్పటికే పలు ప్రాంతాలలో నాలాలు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరిచిన దాని సామర్థ్యం 6 నుంచి 8 సెంటి మీటర్ల వర్షాన్ని మాత్రమే తట్టుకోగలుగుతున్నాయి.కానీ గత రెండ రోజులుగా 12 సెంటి మీటర్ల వర్షం కురుస్తుండటంతో రోడ్లపైకి నీరు చేరుతుంది. లోతట్టు ప్రాంతాలలోని కాలనీ వాసులు వరదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పలు కాలనీలలో ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. భారీగా మురుగు పారుతుండటంతో ఘాటైన వాసన వచ్చి రోగాల బారిన పడుతున్నామని పలు కాలనీలవాసుల వాపోతున్నారు.



వరదధాటికి కొట్టుకుపోయిన హయత్‌నగర్ నుంచి ఇంజపూర్ రోడ్డుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

క్షేత్రస్థాయిలో పరిశీలన..

ముంపు ప్రాంతాల్లో హైడ్రా, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.ముంపు ప్రాంతాల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యగా హెచ్చరికలు జారీ చేడంతో పాటు సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలు కొట్టుకపోకుండా, ప్రజలు ఇబ్బంది పడాకుండా చూస్తున్నారు. వర్షానికి ప్రధాన కారణాలపై ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. మరికొన్ని రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేస్తున్నారు.



హయత్‌నగర్ విజయవాడ జాతీయ రహదారిపై పడిన గుంత

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

సైదాబాద్: సైదాబాద్ హౌజింగ్ బోర్డ్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డిని కలిసి వివరించారు. కాలనీలోని పలు అంతర్గత రహదారులు ఛిద్రమయ్యాయని ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతలలో నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వివరించారు. తాగునీరు, డ్రైనేజీ పైపులైన్లు ఆధునీకరించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. త్వరలో కాలనీలో పర్యటించి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో రాజిరెడ్డి, శ్యామ్ సుందర్, సుబ్బలక్ష్మి, ఫర్హత్ ఉన్నారు.



కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న సభ్యులు

కాలనీ పేరుతో రాజకీయాలు చేయడం తగదు



సమావేశంలో పాల్గొన్న సంక్షేమ సంఘం సభ్యులు

ఎల్‌బీనగర్: కాలనీపేరు చెప్పుకుని రాజకీయాలు చేస్తూ కాలనీకి చెడ్డపేరు తేవాలని చూస్తే ఉపేక్షించేది లేదని వైదేహినగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహినగర్ కాలనీ 824 ప్లాట్ల యజమానుల సమ్మతితో ఆదివారం కాలనీలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. వైదేహినగర్ నార్త్ కాలనీ అసోసియేషన్ పేరుతో మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇప్పటికే కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ఎంపీ రాజేందర్ సహకారాలతో కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని 118 జీఓ ఇప్పటికే కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఓపెన్ ల్యాండ్ ట్యాక్స్‌పై కూడా ఇప్పటికే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కిషన్‌రావు, కోశాధికారి శివరాంప్రసాద్, సంయుక్త కార్యదర్శి రవీంధర్‌రావు,వెంకటేశ్వర్లు, సభ్యులు నామా కోటేష్, జంగారెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన రజక సంఘం కమ్యూనిటీ హాల్‌ను మలక్‌పేట ఎమ్మెల్యే బలాల ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే పరమావధిగా ముందుకు సాగుతామన్నారు. ధోబీఘాట్‌లలో అవసరమైన వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సత్తయ్య, నర్సింహా, యాదయ్య, అశోక్, సురేందర్ పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

స్కూల్ బ్యాగులు, గొడుగుల అందజేత



బ్యాగులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహంలో మలక్‌పేట్‌లోని సత్యశక్తి మహిళా శాఖ కమిటీ సభ్యులు రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ విద్యార్థులకు రాఖీలు కట్టి 110 స్కూల్, కాలేజీ బ్యాగులు, 110 గొడుగులు, 110 లంచ్ బాక్స్‌లు, సబ్బులు, స్నాక్స్ కిట్స్ పంచిపెట్టారు. ఈ సందర్భంగా అగర్వాల్ సమాజ్ సెంట్రల్ కమిటీ సెక్రటరీ సీమాజైన్ మాట్లాడుతూ.. అనాథ విద్యార్థి గృహం ఒక అద్భుతమైన వసతి గృహమని కమిటీ వారు అనాథలను చేరదీసి వారి భవిష్యత్‌కు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అంచల్ గుప్తా, రాణిమిట్టల్, నీతిఅగర్వాల్, పుష్పఅగర్వాల్, కాంతా, బన్సల్, మీనా అగర్వాల్ పాల్గొన్నారు.

వరద చెరువుల్లోకి చేరేలా చర్యలు చేపట్టాలి

మన్సూరాబాద్: వరదనీరు చెరువుల్లోకి వెళ్లేలా చర్యలు చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. హయత్‌నగర్ డివిజన్‌లో ట్రంక్‌లైన్ కుంగిపోవడంతో మన్సూరాబాద్ డివిజన్ వీరభద్రనగర్‌కాలనీని వరదనీటితో పాటు డ్రైనేజీ మురుగు ముంచెత్తిందని కాలనీవాసులు ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ ఆదివారం కాలనీలో పర్యటించారు. జలమండలి, సివరేజీ బోర్డు, హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయంతో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించి వరదనీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సుమారు 20 కాలనీలకు చెందిన వరదనీరు హయత్‌నగర్‌లోని చెరువులకు మళ్లిస్తే సమస్య రాదన్నారు. ఈ కార్యక్రమంలో సందీప్, భరత్, గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గాలయ్య, వెంకటేరెడ్డి, భరతయ్యచారి, స్వామి, జలమండలి డీజీఎం రాజగోపాల్, మేనేజర్ రాజు, హైడ్రా అధికారి వేణు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రచార ఆర్భాటాలకే పరిమితం'

నాగోలు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు పరిమితమై.. పాలనను గాలికి వదిలేసిందని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై. సతీష్‌రెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. వర్షాకాలం రాకముందే వరద నీటి వ్యవస్థకు మరమ్మతు చేపట్టాల్సి ఉండగా సర్కారు అలసత్వంతో చిన్నపాటి వర్షాలకే రోడ్లు, ఫ్లై ఓవర్లు చెరువులను తలపిస్తున్నాయన్నారు. హడావుడిగా మేల్కొన్న ప్రభుత్వం మూసీ ప్రక్షాళన, వరద నీటి నిర్వహణకు పరిష్కారాలు అంటూ సమీక్షల పేరుతో మభ్యపెడుతోందని ఆరోపించారు. వరద నీటి నిర్వహణపై చేపట్టాల్సిన చర్యలపై కాకుండా మూసీ పరీవాహక ప్రాంతంలో భారీ ఎత్తున గేట్ వే ఆఫ్ హైదరాబాద్, ఐకానిక్ బిల్డింగ్ నిర్మిస్తామని చెబుతున్నారని ఇదంతా కూడా ప్రజలను మభ్యపెట్టడానికి మాత్రమేనన్నారు. పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, ట్రాఫిక్ నిర్వహణపై కనీస అవగాహన లేకుండా పని చేస్తున్నారని ఆరోపించారు.

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కమిటీ ఎన్నిక

మీర్‌పేట: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మీర్‌పేట కార్పొరేషన్ నూతన కమిటీని ఆదివారం ఉత్సవ సమితి మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్ గణాటి సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిల్లంపల్లి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం జగన్, పల్లె జంగయ్యగౌడ్, భీంరాజ్, గౌరవ అధ్యక్షులుగా పసునూరి భిక్షపతిచారి, కీసర హరినాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా చప్పిడి జంగారెడ్డి, వి.గోపినాథ్‌చారి, దిండు భూపేశ్‌గౌడ్, కాశీరాం యాదవ్, కీసర కృష్ణారెడ్డి, గాజుల మధు, ఉయ్యాల నవీన్‌గౌడ్, కోశాధికారిగా ఎడ్ల మల్లేశ్‌ముదిరాజ్, కార్యదర్శులుగా జటావత్ రవినాయక్ తదితరులు ఎన్నికయ్యారు. మీర్‌పేట కార్పొరేషన్‌లో రాజకీయాలకతీతంగా హిందూ పండుగలను ఐకమత్యంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు కోరారు.

కాలనీవాసులంతా ఏకతాటిపై ఉండాలి



ప్రియదర్శినికాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: కాలనీవాసులు ఓకే తాటిపై ఉన్నప్పుడు కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టంచేశారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి ప్రియదర్శినీకాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఆదివారం ఆయన కాలనీలో పర్యటించి మాట్లాడారు. కాలనీలోని అపార్ట్‌మెంట్‌వాసులు, ఇండిపెండెంట్ ఇళ్లవాసుల నడుమ గత కొన్ని రోజులుగా మనస్పర్థలు వస్తున్నాయని, వాటిని దూరం చేసుకోవాలన్నారు. కాలనీవాసులందరూ కుటుంబం తరహా కలిసి మెలసి ఉండాలన్నారు. కాలనీవాసులంతా కలిసికట్టుగ ఓ నిర్ణయంపై ఉంటే అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, చంద్రారెడ్డి, అనిల్‌కుమార్, శివశంకర్, శ్రీకాంత్‌యాదవ్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఎల్‌బీనగర్: కాలనీవాసుల ఫిర్యాదులపై అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు.బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో డ్రైనేజీ, మంచి నీటి సమస్యలపై జలమండలి డీజీఎం రాజగోపాల్, మేనేజర్ సరివెన్నెల, పలు కాలనీలవాసులతో ఎమ్మెలే తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పొగుల రాంబాబు కాలనీ డ్రైనేజీ సమస్యను వివరించగా వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

క్యూబాకు అండగా ఉందాం



నిధి సేకరణ చేస్తున్న సీఐటీయూ నాయకులు

వనస్థలిపురం: అమెరికా సామ్రాజ్యవాద ఆంక్షలకు వ్యతిరేకంగా గత 60 ఏళ్లుగా క్యూబా ప్రజలు పోరాడుతున్నారని, వారికి ప్రపంచ కార్మికులు అందరూ అండగా ఉండాలని సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం వనస్థలిపురం రైతుబజారు వద్ద క్యూబా సంఘీభావ నిధి సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. అమెరికాలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా క్యూబా పట్ల పాలకుల వైఖరి ఒక్కటిగానే ఉందని అన్నారు. క్యూబా ఆవిర్భావ దినం నుంచి మన ప్రజలు క్యూబాకు అండగా ఉంటున్నారని అన్నారు. ధన, వస్తు రూపాలలో అనేకమార్లు క్యూబా ప్రజలకు చేయూతనిచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, లక్ష్మణ్, భారతమ్మ, కాశయ్య, వెంకటయ్య, జయమ్మ, వరలక్ష్మి, ఝాన్సీ, నిర్మల, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఆనంద్‌నగర్‌లో..

నాగోలు: అమెరికా సామ్రాజ్యవాద ఆంక్షలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు అండగా నిలిచేలా సీఐటీయూ ఆధ్వర్యంలో నిధుల సేకరణ చేస్తున్నట్లు సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం నాగోలు డివిజన్ ఆనంద్‌నగర్‌లో సీఐటీయూ స్ట్రీట్ వెండర్స్ ఆధ్వర్యంలో క్యూబా సంఘీభావ నిధుల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ..అమెరికన్ సామ్రాజ్యవాద ఆంక్షలకు వ్యతిరేకంగా క్యూబా ప్రజలు పోరాడుతూనే తమ దేశాన్ని ముందుకు తీసుకుపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, సైదులు, కృష్ణ, సుజాత, జ్యోతి, వెంకన్న, నాగార్జున పాల్గొన్నారు.



నాగోలు ఆనంద్‌నగర్‌లో విరాళాలు సేకరణ చేస్తున్న నాయకులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



డ్రైనేజీ గుంతలను పరిశీలిస్తున్న డీసీ అలీ, ఏఎంహెచ్‌ఓ శ్రీనివాస్

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ అలీ వెల్లడించారు. ఆదివారం ఆయన ఓల్డ్‌మలక్‌పేటలో డ్రైనేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలించి మాట్లాడారు. కమిషనర్ ఆదేశాల మేరకు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్నామని సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్లపై బురద, చెత్త కుప్పలు లేకుండా చూడాలని ప్రతి బస్తీల్లో ఫాగింగ్ చేయాలన్నారు.

● మూసీకి అనుకొని ఉన్న కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు. ఏఎంహెచ్‌ఓ అధికారులతో కలిసి మూసానగర్, పద్మనగర్, శంకర్‌నగర్ తదితర కాలనీలలో ఆయన పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. అవసరమైతే వరదలు ముంపు ఉంటే పునరావాసాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. డీసీ వెంట ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఖిల్లా మైసమ్మ దేవాలయంలో బోనాలు



బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

దిల్‌సుఖ్‌నగర్: దిల్‌సుఖ్‌నగర్ మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ దేవాలయంలో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకల్లో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఎంపీకి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తంరావు, త్రివేది,నవీన్, తోట రాజు, నాగరాజు, వేణు, ఆవుల రామారావు, క్రాంతి పాల్గొన్నారు.